నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 6 అక్టోబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

పరిశీలన.. పరేషాన

- ముగిసిన డీఎస్సీ సర్టిఫికెట్ వెరిఫికేషన్
- నేటికీ అందని ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ జాబితా
- ఏజెన్సీ గిరిజనులకు న్యాయం చేయాలని కోరుతున్న అభ్యర్థులు



సర్టిఫికెట్ వెరిఫికేషన్ కేంద్రం వద్ద మహబూబ్‌నగర్ డీఈవోతో మాట్లాడుతున్న ఏజెన్సీ ప్రాంతాల గిరిజన అభ్యర్థులు

మహబూబ్‌నగర్ విద్యా విభాగం, అక్టోబర్ 5 : డీఎస్సీ-2024 రాత పరీక్షా ఫలితాల్లో 1:3కి ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ముగిందని అధికారులు శనివారం సాయంత్రం 7:40గంటలకు అధికారికంగా వెల్లడించినా.. అభ్యర్థులు మాత్రం పరేషాన్‌లోనే ఉన్నారు. ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 1 నుంచి 5వ తేదీ సాయంత్రం 5గంటల వరకు ఉండగా.. ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ జాబితాలు నిర్దేశిత వెబ్‌సైట్‌లో గడువు ముగిసినా పొందుపర్చక పోవడం, స్పోర్ట్స్ కోటా కింద జీవో నం.74, 107 ప్రకారం ఉద్యోగాలు ఇస్తామని చెప్పినా.. అధికారులు వాటిపై పూర్తి స్థాయిలో స్పష్టత ఇవ్వక పోవడం విడ్డూరంగా ఉందని అభ్యర్థులు పేర్కొంటున్నారు. 2008 డీఎస్సీకి సంబంధించి ఏజెన్సీ ప్రాంతాల్లోని ఉద్యోగాలకు మైదాన ప్రాంతాల వారిని పిలిచారంటూ ఏజెన్సీ ఏరియా గిరిజన హక్కుల పరిరక్షణ సమితి నాయకులు డీఈవో రవీందర్‌ను డైట్ కళాశాలలో కలిసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గతంలో నాన్ ఏజెన్సీ అభ్యర్థుల పేర్లు ప్రకటించారని, అధికారులు సైతం 1:3 నిష్పత్తిలో భాగంగా ఇప్పుడు మైదాన ప్రాంత గిరిజనుల ధ్రువపత్రాలు పరిశీలన చేశారని ఆరోపించారు. ఆయా ధ్రువపత్రాలపై నిజనిర్ధారణ చేసి ఏజెన్సీ గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. ఏజెన్సీ గిరిజనులకు సంబంధించిన 18 మంది జాబితాను డీఈవోకు అందజేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 243 ఉపాధ్యాయ పోస్టులకు 1:3 నిష్పత్తిలో 729 మంది జాబితాలు ఎంపిక చేసి రాష్ట్ర అధికారులు జిల్లా స్థాయికి పంపించాల్సి ఉండగా.. ఈ జాబితాలు వాయిదాల పర్వంలా వచ్చాయి. వీటికి అనుగుణంగానే జిల్లా విద్యా శాఖఅధికారులు ఆన్‌లైన్‌లో నివేదిస్తూ అభ్యర్థులకు సంక్షిప్త సందేశాలు పంపిస్తూ.. ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. మొత్తం 243 పోస్టులకు 576 మందిని మాత్రమే పిలిచారు. వీరిలోనూ 24 మంది అభ్యర్థులు గైర్హాజర్ అయ్యారు. 2008 డీఎస్సీ అభ్యర్థులు మొత్తం 361 మందికి గాను 175 మంది మాత్రమే హాజరయ్యారు. 186 మంది గైర్హాజరు అయ్యారు. చిన్న పాటి ఉద్యోగాలకే క్యూ కడుతున్న నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగానికి పిలిచినా రాలేదా.? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ సాయంత్రం వరకు రాకపోవడంతో నిరీక్షిస్తున్న అభ్యర్థులు

సమాచార లోపమా? జాబితా రాకపోవడమా?

ఈనెల 9న డీఎస్సీ 2024 వారికి నియామక పత్రాలను అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన వారికి మాత్రమే పోస్టులు కేటాయిస్తారా, రాని వారి పరిస్థితి ఏమిటని, పూర్తి స్థాయిలో వారికి సమాచారం అందిందా అనే ప్రశ్నలుగా మిగిలాయి. ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో 20పోస్టులు జిల్లాలో ఉండగా 1:3 ప్రకారం 60 మంది అభ్యర్థులను పిలవాలి. మరి ఈ జాబితాలు ఏమయ్యాయనే సందేహాలు ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగులను వేధిస్తున్నాయి. ఈ విషయంపై డీఈవో రవీందర్‌ను సంప్రదించగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందుకు సాగుతామన్నారు. ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్టు కేసు ఉందన్నారు. గడువు ముగిసే సమయానికి 576 మంది అభ్యర్థులకు గానూ 552 మంది హాజరు కాగా, 24 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. కాగా, 2008 డీఎస్సీకి సంబంధించి 186 మంది గైర్హాజరు అయ్యారని పేర్కొన్నారు.



సూర్యప్రకాశ్‌రావును సన్మానిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సూర్యప్రకాశ్‌రావుకు అభినందనల వెల్లువ

- సన్మానించిన మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు

కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 5 : కల్వకుర్తి మండలం సత్య సాయినగర్ సూర్యలత కాటన్‌మిల్లు బీఆర్ఎస్‌కేవీ అధ్యక్షుడు సూర్యప్రకాశ్‌రావు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌తో కలిసి శనివారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే మాజీ మంత్రి హరీశ్‌రావును కూడా కలిశారు. కాటన్‌మిల్ కార్మిక సంఘం అధ్యక్షుడిగా మూడో సారి ఎన్నిక కావడంతో సూర్యప్రకాశ్‌రావును సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యం, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు మధు, విజయ్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్, నాయకులు మల్లేశ్, బాలయ్య, రాజు, కిశోర్‌రెడ్డి, లింగం ఉన్నారు.



మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన సూర్యప్రకాశ్‌రావు

విదేశాల్లో బతుకమ్మ వేడుకలు అభినందనీయం

- ఆస్ట్రేలియాలో పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, అక్టోబర్ 5 : ఆస్ట్రేలియాలో తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేక విధ పండుగ బతుకమ్మ అని అన్నారు. తెలంగాణను చిన్నబుచ్చి, అస్తిత్వాన్ని కించపరచడం, వనరులను ఇతర ప్రాంతాలకు తరలించడం వల్లే స్వరాష్ట్రం కోసం పోరాడి సాధించుకున్నామని గుర్తుచేశారు. మన సంస్కృతిని, బతుకమ్మ పండుగను విదేశాల్లో సైతం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉత్సవాలు నిర్వహిస్తున్న తెలంగాణ వాదులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ప్రజలకు కూడా విషెస్ చెప్పారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్‌ప్రకాశ్, ప్రమోద్‌రెడ్డి ఉన్నారు.

ఆస్ట్రేలియాలోని బతుకమ్మ వేడుకలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

పాలమూరులో బతుకమ్మతో వస్తున్న యువతి

వాగ్దేవి జూనియర్ కళాశాలలో..

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో..

అంగరంగ వైభవంగా పూలపండుగ

'తెలంగాణలో పుట్టి.. పూల పల్లకి ఎక్కి.. లోకమంతా తిరిగేవటే' అంటూ జిల్లాలో వైభవంగా బతుకమ్మ ఆడుతున్నారు. శనివారం మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, న్యూటౌన్‌లోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. బతుకమ్మ ఆడుతూ ఆడిపాడారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారిణి కౌసర్ జహాన్ వేడుకల్లో పాల్గొన్నారు.

– మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 5

గురుకుల విద్యార్థికి బంగారు పతకం

ధన్వాడ, అక్టోబర్ 5 : ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు కోస్గిలో నిర్వహించిన 68వ క్రీడా సమాఖ్య అండర్-17 హ్యాండ్‌బాల్ పోటీల్లో కొండా పుల్ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థి గణేశ్ బంగారు పతకం సాధించాడని పాఠశాల ప్రిన్సిపాల్ రాజారాం తెలిపారు. దీంతో విద్యార్థిని పీఈటీ రామ్మోహన్‌గౌడ్ తదితరులు అభినందించారు.

బంగారు పతకం సాధించిన గణేశ్

అర్ధరాత్రి యువత హల్‌చల్

- స్థానికుల సమాచారంతో పోలీసుల దాడులు
- ఇద్దరిపై కేసు నమోదు, పరారీలో మరి కొందరు
- మొబైల్ ఫోన్లు, కండోమ్‌లు, మద్యం స్వాధీనం

గద్వాల అర్బన్, అక్టోబర్ 5 : జిల్లా కేంద్రంలోని హమాలీ కాలనీ సమీపంలో కొంత మంది యువతీ, యువకులు శుక్రవారం రాత్రి మద్యం తాగి చిందులు వేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోగా, కొందరు పట్టుబడగా, మరి కొందరు పరారయ్యారు. పట్టుబడిన వారి నుంచి మొబైల్ ఫోన్లు, కండోమ్ ప్యాకెట్లు, మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. పట్టుబడిన వారిలో కొంత మంది రాజకీయ నాయకుల బంధువులు ఉండడంపై సర్వత్రా చర్చ మొదలైంది. ఈ విషయంపై గద్వాల టౌన్ ఎస్సై కళ్యాణ్‌ను వివరణ కోరగా, హమాలీ కాలనీలో కొంత మంది హల్‌చల్ చేస్తున్నట్లు సమాచారం రావడంతో అదుపులోకి తీసుకున్నామని, ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధిస్తూ తీర్పును వెల్లడించడంతో రిమాండ్‌కు తరలించామన్నారు. విచారణ చేపడుతున్నట్లు వెల్లడించారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన

అచ్చంపేట డిపో గేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

అచ్చంపేట రూరల్, అక్టోబర్ 5 : ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా నాయకుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. శనివారం డిపో గేట్ ఎదుట కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ ఎలక్ట్రిక్ బస్సులను సంస్థనే కొనుగోలు చేసి కార్మికులను రిక్రూట్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. వివిధ రకాల బకాయిలను, 173 నెలల డీఏ ఏరియర్స్ చెల్లించాలన్నారు. 2019 సమ్మె సందర్భంగా ప్రాణాలర్పించిన ఆర్టీసీ అమరవీరులకు నివాళులర్పించారు.

రైతులకు కాంగ్రెస్ మొండిచేయి

- బీఆర్ఎస్ గద్వాల జిల్లా నాయకుడు హన్మంతునాయుడు

మల్దకల్, అక్టోబర్ 5 : కాంగ్రెస్ సర్కారు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అని చెప్పి కొందరికే మాఫీ చేసి మొండిచేయి చూపించిందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హన్మంతునాయుడు అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నేత శేఖర్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా హన్మంతునాయకుడు మాట్లాడుతూ.. 9 నెలల్లోనే కాంగ్రెస్ 420 హామీలపై స్పష్టత వచ్చిందన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించామంటూ సరిపోయిన బస్సులు లేక ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో గద్వాల జిల్లాలో గులాబీ జెండా ఎగురవేశామని, కొందరు స్వలాభం కోసం పార్టీ మారారన్నారు. అయినా కూడా గ్రామాల్లో బీఆర్ఎస్‌కు ఏ మాత్రం ఆదరణ తగ్గలేదన్నారు. కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. గట్టు ఎత్తి పోతల డిజైన్ మార్చాలని పార్టీ మారిన ఎమ్మెల్యే అంటున్నారని, అలా చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కర్ణాటకకు మేలు చేసేందుకు ఇక్కడి రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు బస్వరాజు, మోనేశ్, జనార్దన్‌రెడ్డి, శేఖర్ నాయుడు, తిరుమలేశ్, రాజు, ముని, రాము, వెంకటేశ్, బొజ్జయ్య, నాగరాజు, లోకేశ్, కామేశ్ పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన కార్యకర్తలు, మాట్లాడుతున్న బాసుహనుమంతు నాయుడు

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

ధన్వాడ, అక్టోబర్ 5 : క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని డీవైఎస్‌వో వెంకటేశ్ అన్నారు. శనివారం రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల ముగింపు కార్యక్రమంలో అండర్-14, 17 విభాగాల్లో 108 మంది విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధన్వాడ కేజీబీవీలో రెజ్లింగ్ హాల్ నిర్మాణం కోసం నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి రూ.11లక్షలు మంజూరు చేశారని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. క్రీడాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రెజ్లింగ్ క్రీడాకారుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో హన్మకొండ డీవైఎస్‌వో అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ అబ్దుల్, ఎస్సై రమేశ్, మాస్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

జూరాలకు తగ్గిన వరద

గద్వాల/అయిజ, అక్టోబర్ 5 : జూరాల ప్రాజెక్టుకు వరద తగ్గుముఖం పట్టింది. ఎగువ నుంచి శనివారం 55,000 క్యూసెక్కుల వరద వస్తున్నది. పూర్తి స్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 9.255 టీఎంసీలుగా ఉన్నది. ఎడమ కాల్వకు 1,140, కుడికాల్వకు 730, నెట్టెంపాడ్ లిఫ్ట్‌కు 750, బీమా లిఫ్ట్-2కు 750, సమాంతర కాల్వకు 400 క్యూసెక్కులను వదిలారు. 35,621 క్యూసెక్కులను వినియోగిస్తూ ఐదు యూనిట్లలో విద్యుదుత్పత్తి చేస్తున్నారు. అలాగే తుంగభద్ర డ్యాంలో ఇన్‌ఫ్లో 14,712, అవుట్‌ఫ్లో 13,625 క్యూసెక్కులుగా ఉన్నది. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 101.773 టీఎంసీల నిల్వ ఉన్నది. ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో 3,291, అవుట్ ఫ్లో 2,676 క్యూసెక్కులుగా ఉన్నది. ఆయకట్టుకు 615 క్యూసెక్కులను వదిలారు. ఆల్మట్టికి ఇన్‌ఫ్లో 26,869, అవుట్ ఫ్లో 24,010 క్యూసెక్కులుగా నమోదుకాగా ప్రస్తుతం 128.19 టీఎంసీల నిల్వ ఉన్నది. నారాయణపుర ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 26,505, అవుట్ ఫ్లో 27,437 క్యూసెక్కులు నమోదుకాగా.. ప్రస్తుతం 37.46 టీఎంసీల నిల్వ ఉన్నది.

చంద్రఘంటాదేవీగా దర్శనమిస్తున్న జోగుళాంబ

సాత్విక రూపిణి.. చంద్రఘంటాదేవి

అలంపూర్, అక్టోబర్ 5 : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దక్షిణకాశీగా పేరుగాంచిన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో జోగుళాంబ దేవీ శనివారం చంద్రఘంటా దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గామాతను పూజించడం వల్ల దుష్టశక్తులు దూరమై దేవతాశక్తులు ఆరాధకుడి దరి చేర తాయని భక్తుల నమ్మకం. జపమాల, ఘంట, బాణం, పదునైన ఖడ్గం, శ్వేత పద్మం, పాన పాత్ర త్రిశూలం, ధనస్సు, కమండలం, గద ధరించి మహా లావణ్య శోభతో ప్రకాశించే విధంగా దర్శనమిస్తుంది. ఏర్పాట్లను ఈవో పురేందర్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు పర్యవేక్షించారు.

శ్రీశైలంలో..

శ్రీశైలం, అక్టోబర్ 5 : శ్రీశైలం భ్రమరాంబాదేవీ చంద్రఘంటాదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆదిపరాశక్తుల్లో తృతీయరూపిణి అయిన చంద్రఘంటాదేవి యుద్ధోన్ముఖురాలై సింహవాహనాన్ని అధిష్టించి భక్తులకు దర్శనమివ్వగా, చంద్రఘంటా సమేతుడైన శ్రీశైలేశుడు రావణ భుజస్కంధాలపై విహరిస్తూ భక్త జనాన్ని అలరింపజేశారని ఈవో పెద్దిరాజు తెలిపారు. అనంతరం చంద్రఘంటాదేవి సమేతుడైన శ్రీశైలేశుడు రావణ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కన్నడ జానపదాలు వివిధ రకాల విన్యాసాలతో ఆద్యాంతం కనులపండువగా సాగింది. ఆలయ దక్షిణ మాడవీధిలో కళారాధన సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో పీఆర్‌వో శ్రీనివాసరావు, పర్యవేక్షకులు అయ్యన్న, హర్యానాయక్, ఉన్నారు.

రావణవాహనంపై శ్రీశైల ఆదిదంపతులు

చేనేత హస్తకళా ప్రదర్శన
మరియు అమ్మకం
బతుకమ్మ దసరా సూపర్ సేల్
నమ్మకమైన మీ సంస్థ నుండి నమ్మకమైన ధరలు, నాణ్యమైన వస్త్రాలు
కళా సిల్క్
భారతదేశంలో ఎంపికైన చేనేత కళాకారులచే అద్భుత అల్లికలతో తయారైన సిల్క్ మరియు కాటన్ వస్త్రాలు
HANDLOOM INDIA
ఆంధ్రప్రదేశ్: ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కలంకారి మరియు ఉప్పాడ, అస్సాం: మూగా & ఎరిసిల్క్స్, తమిళనాడు: బగల్పుర సిల్క్స్ & టస్సర్, ఉత్తరప్రదేశ్: బ్రిజల్ వర్క్స్ కోసా సిల్క్స్, గుజరాత్: బాందిని, కచ్చ ఎంబ్రైడరీ డ్రెస్ & శారీస్, జమ్మూ & కాశ్మీర్: ఎంబ్రైడరీ శారీలు, డ్రెస్ మెటీరియల్స్ & పాష్మీనా శాల్, కర్ణాటక: క్రేప్ & ప్రింటెడ్ శారీలు, డ్రెస్ మెటీరియల్స్, మధ్యప్రదేశ్: చందేరి, మహేశ్వరి, మహారాష్ట్ర: కోటా, బాందేజ్, బ్లాక్‌ప్రింట్స్, సంగ్లరి ప్రింట్స్, డ్రెస్ మెటీరియల్స్, తెలంగాణ: గద్వాల్, నారాయణపేట & పోచంపల్లి, ఉత్తరప్రదేశ్: జమ్దాని & బనారస్ లక్నోవి డ్రెస్ మెటీరియల్స్, • హరియాణ బెడ్‌కవర్లు & కుషన్ కవర్లు • లక్నోవి, కుర్తీస్ & డ్రెస్ మెటీరియల్స్
TIME: 10.30 AM TO 9:30 PM
పాత పేపర్లు ఇవ్వండి రాసేయండి
COLOURFUL EXHIBITION
All Debit / Credit Cards Accepted
15th Sept to 10th Oct-24
T.T.D. కళ్యాణ మండపం
గవర్నమెంట్ లా కాలేజ్ ఎదురుగా, రైల్వే స్టేషన్ రోడ్, మహబూబ్‌నగర్

నమస్తే తెలంగాణ
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పనిచేయుటకు మండలాల వారీగా విలేకరులు కావలెను. స్థానిక సమస్యలు, సమకాలీన రాజకీయాలపై అవగాహన కలిగి ఉండాలి. అర్హత, ఆసక్తి, అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుంది.
మహబూబ్‌నగర్ జిల్లా : ★ మహబూబ్‌నగర్ టౌన్ ★ కోయిలకొండ ★ జడ్చర్ల టౌన్ ★ జడ్చర్ల రూరల్ ★ రాజాపూర్
నారాయణపేట జిల్లా : ★ కోస్గి టౌన్ ★ గుండుమాల్ / కొత్తపల్లి ★ సర్వ
వనపర్తి జిల్లా : ★ వనపర్తి రూరల్ ★ వనపర్తి మున్సిపాలిటీ ★ రేవల్లి ★ శ్రీరంగాపూర్
జోగులాంబ గద్వాల జిల్లా : ★ గద్వాల రూరల్ ★ అలంపూర్ రూరల్ ★ అలంపూర్ చౌరస్తా
నాగర్‌కర్నూల్ జిల్లా : ★ నాగర్ కర్నూల్ రూరల్ ★ నాగర్‌కర్నూల్ టౌన్ ★ తెలకపల్లి ★ కల్వకుర్తి టౌన్ ★ కొల్లాపూర్ రూరల్ ★ కొల్లాపూర్ టౌన్ ★ మన్ననూరు ★ దోమలపెంట
రాత పరీక్ష తేది : 09-10-2024
సమయం : ఉదయం 11 గంటలకు
పరీక్షా కేంద్రం
వాగ్దేవి జూనియర్ కళాశాల
న్యూటౌన్, మహబూబ్‌నగర్
Cell : 9182777499, 9182777874